ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా సింగిల్ ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్త - పొడిచెత్త - హాని కర చెత్త, తడిచెత్త నుంచి కంపోస్టు ఎరువు తయారీపై చంపాగల్లివీధి వార్డు సచివాలయం పరిధిలో అవగాహన కల్పించారు. చంపాగల్లివీధి స్కూల్‌లో మొక్కలు నాటి, స్కూల్ టీచర్లు, పిల్లలు, సచివాలయం సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, వార్డు ఇన్‌ఛార్జి పాండ్రంకి శంకర్, కె.పద్మావతి, వైశ్యరాజు లక్ష్మి, వార్డు అడ్మిన్ పవన్‌కుమార్, సచివాలయం సిబ్బంది, ఆర్‌పీ జమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం


https://www.satyamdaily.net/

శనివారం 15-3-2025

సంపుటి: 20 సంచిక: 299


పేజీలు: 8 వెల: రూ.1


# చెరువును చెరబట్టి.. ప్లాట్లుగా విడగొట్టి..!






**అధికారులు వస్తుంటారు.. పోతుంటారు. చంటిగాడు మాత్రం లోకల్.. అన్నట్లు పలాసలో భూబకాసురులు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా జంట పట్టణాల్లో భూకబ్జాలు మాత్రం అడ్డూఅదుపూ లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పారీతో అంటకాగుతూ భూదందాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు భూఆక్రమణలకు తెగబడుతున్నారని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చర్చ జరుగుతోంది. వారితో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు కూడా కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నాయకులుగా చెలామణీ అవుతున్నవారు ఏకంగా చెరువునే జిరాయితీగా భూమిగా మార్చేసి రియల్ దందా ప్రారంభించారు.**





- ♦కబ్జా కోరల్లో పలాస మాలబంద చెరువు
- ♦23 ఏళ్ల క్రితం ఆగిన దందా మళ్లీ తెరపైకి
- ♦అధికారుల సహకారంతో రికార్డుల తారుమారు
- ♦టీడీపీ నేతల పరిచయాలతో కథ నడిపించిన కబ్జాదారుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొన్నటికి మొన్న పట్టణ నడిబొడ్డున సర్వే నెంబర్ 219/3లో ఉన్న సుమారు రూ.3 కోట్ల విలువైన 565 చదరపు అడుగుల స్థలాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నేతల సహకారంతో ఇద్దరు వ్యక్తులు, కొందరు బంగారం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఈ అంశం పలాసలో హాట్ టాపిక్‌గా మారింది. ఇదే తరుణంలో ఎప్పుడో 2002లో మరుగున పడిపోయిన చెరువు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. పలాస తహసీల్దారు కార్యాలయ మార్గంలో కోర్టుకు ఎదురుగా సర్వే నెంబర్ 191/3 (ఎల్‌పీ నెంబర్ 317)లో 80 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న మాలబంద (డబ్బాల చెరువు) జిరాయితీ భూమిగా మారిపోయింది. ఈ చెరువు కబ్జాకు 23 ఏళ్ల క్రితమే కొందరు ప్రయత్నించారు. దానిపై 14 అక్టోబర్ 2002లో ఒక ప్రధాన పత్రికలో 'నిన్నటి చెరువులు నేడు ప్లాట్లు' అంటూ ఒక కథనం ప్రచురితమైంది. మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధుల సహకారంతో చెరువును కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని కథనంలో పేర్కొన్నారు. దీంతో కొన్నాళ్ల పాటు అక్రమదందా నిలిచిపోయింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాలబంద చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత అప్పటి సీఎంకు, రెవెన్యూ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు కూడా రాశారు. మరోవైపు ప్రజాసంఘాల ప్రతినిధులు సొంపేట కోర్టులో ఓఎస్ 43/2002 నెంబరుతో దావా వేశారు. దీనిపై తహసీల్దారు వివరణ సంతృప్తిగా లేకపోవడం, రికార్డులు ట్యాంపరింగ్ చేశారన్న ఆరోపణలతో ఆయనపై స్థానికులు 2006 ఫిబ్రవరి 22న ఫిర్యాదు చేశారు. అలాగే కలెక్టర్‌ను కలిసి చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ నాగేశ్వరరావు స్టాప్ ఆల్ ప్రొసీడింగ్స్ అంటూ పలాస తహసీల్దారుకు లేఖ పంపించారు. దీంతో ఆక్రమణదారులు వెనక్కి తగ్గారు. ఆ తర్వాత పలాసకు చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో చెరువు ఆక్రమణ యత్నాలు నిలిచిపోయాయి. 2002లో చెరువును రూ.33 లక్షలకు కొనుగోలు చేసిన నాయుడు దాన్ని వదిలించుకోవడానికి ఆతర్వాత అనేక ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు.

**రెవెన్యూ రికార్డులు మార్చేశారు..**

కోర్టు ఉత్తర్వులతో 23 ఏళ్ల క్రితం మరుగున పడిన చెరువు కబ్జా యత్నాలు మళ్లీ మొదలయ్యాయి. చెరువును జిరాయితీ భూమిగా మార్చి దాన్ని స్థానిక అధికారుల సహకారంతో ల్యాండ్ కన్వర్షన్ చేయించి రియల్ ఎస్టేట్ దందాకు మార్గం సుగమం చేశారు. నాయుడుకు జిల్లాలోని టీడీపీ అగ్రనాయకులతో మంచి దోస్తీ ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులందరికీ హైదరాబాద్‌లో సకల వసతి సౌకర్యాలు, వాహనాలు సమకూరుస్తూ మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఆ పరిచయాలతోనే 2014కు ముందే సీసీఎల్‌ఏలో పలాసకు చెందిన దేవదాయ, ప్రభుత్వ భూములకు చెందిన - మిగతా చివరి పేజీలో


**CHANGE OF NAME**

I, **KHADAR MOHIDDIN KHAN** S/O MD AMEERUDDIN Previously called **MOHAMMAD KADHAR MOHIDHIN KHAN** Resident of S/o MD AMEERUDDIN, FLAT NO-4, SANTHI NAILAYAM, S A T NAGAR, THOTAPALEM, SRIKAKULAM, ANDHRA PRADESH-532005. Now Changed my name from **MOHAMMAD KADHAR MOHIDHIN KHAN** to **KHADAR MOHIDDIN KHAN**. Hence forth I will be called as **KHADAR MOHIDDIN KHAN**


## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంజీఆర్



(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గం కేంద్రంలో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రధానమైన బస్టాండ్ దగ్గర ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని కొనియాడారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు సైతం చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, **MOHAMMAD AHMMDUNISH BEGUM** W/O KHADAR MOHIDDIN KHAN Previously called **MOHAMMAD AHAMADUNNISA BEGUM** Resident of W/o KHADAR MOHIDDIN KHAN, FLAT NO-4, SANTHI NAILAYAM, S A T NAGAR, THOTAPALEM, SRIKAKULAM, ANDHRA PRADESH-532005. Now Changed my name from **MOHAMMAD AHAMADUNNISA BEGUM** to **MOHAMMAD AHMMDUNISH BEGUM.** Hence forth I will be called as **MOHAMMAD AHMMDUNISH BEGUM.**


## ప్లాస్టిక్ రహిత పలాస లక్ష్యం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపు
- ఆఫ్‌షోర్ పూర్తి చేస్తాం: అచ్చెన్నాయుడు హామీ



(సత్యంన్యూస్, పలాస)

వాతావరణంలో చోటుచేసుకుంటున్న తీవ్రమైన మార్పులకు ప్రధాన కారణం మనమేనని, మనం విచ్చలవిడిగా వాడి పారేసే ప్లాస్టిక్ భూతంలా మారి పర్యావరణాన్ని నాశనం చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని ఆయన ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర జిల్లా కార్యక్రమంలో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ జీడిపిక్క బొమ్మ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పలాసను వ్యాపార, విద్యాకేంద్రంగా అభివృద్ధి చేస్తామని, రూ.120కోట్లతో పూండి-డోల రోడ్డు, పలాసలో కేంద్రీయ విద్యాలయం, విమానాశ్రయం, రూ.48 కోట్లతో రైల్వేఓవర్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పలాస చాలా చైతన్యవంతమైన ప్రాంతమని, ఇక్కడి ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపకల్పన చేశారని, అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాలు పరిశుభ్రత పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకుంటున్నాయని అన్నారు. పలాస-కాశీబుగ్గ మంచి నీటి కష్టాలు తీర్చేందుకు ఆఫ్‌షోర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని, రూ.90 కోట్లు ప్రస్తుత బడ్జెట్లో కేటాయించామని చెప్పారు. పలాస రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 100 శాతం నిధులు కేంద్రం నుంచే తీసుకురావడంలో కృషి చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును అభినందించారు. జిల్లా ప్రత్యేక అధికారి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు, ప్రతి వీధి శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ వేసవిలో మున్సిపాలిటీకి నీటి కష్టాలు తీర్చిన మంత్రులకు, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పలాస సీహెచ్‌సీ ఎదుట రోడ్డును స్వయంగా శుభ్రం చేశారు. చెత్త నుంచి ఎరువు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాళ్లను సందర్శించారు. మహిళలకు జ్యూట్ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. అందరూ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాకింగ్ ట్రాక్

### - నిర్మాణపు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.8లక్షలతో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డిగ్రీ కళాశాల సిబ్బంది క్రీడామైదానం అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరడంతో దీనిపై దృష్టి సారించామని, ట్రాక్ నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీవో, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు ఇచ్చే నిర్ణయం ఉపసంహరించుకోవాలని కాంట్రాక్టు & ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఆర్.చిన్నారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ, స్థానిక సంస్థల్లోని ఔట్‌సోర్సింగ్, యూనివర్సిటీలు, ప్రభుత్వ సొసైటీలు, విద్యుత్, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష తదితర అన్ని ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్ అమలుచేయాలని, ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఏపీ కాంట్రాక్ట్ & ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్ & బి బంగ్లా నుంచి ఉద్యోగులు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి, జిల్లా రెవిన్యూ అధికారి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాస్‌లో వివిధ విభాగల్లో పని చేస్తున్న నాయకులు నక్క శ్రీనివాసరావు, ధన్వంతరి, ప్రసాద్, గుజ్జల ఆదినారాయణ, రిమ్స్ ఉద్యోగులు కె.తేజ, కిరణ్, టి.సాయి, జి.ధర్మారావు, జ్యోతికుమారి, మౌనిక, ప్రత్యూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● ఎడిటోరియల్

# బలూచ్ వెనుక సీఐఏ!

సీఐఏతో సహవాసం అంటే వాడుకొని వదిలెయ్యడమే. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ 20 ఏళ్లు సీఐఏతో కలిసి పనిచేసింది. ఎంతలా అంటే పాకిస్తాన్‌లో ఒకే ఆఫీసులో సీఐఏ, ఐఎస్ఐలు కలిసి పనిచేశాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ సైన్యానికి వ్యతిరేకంగా ముజాహిదిన్‌లకు శిక్షణ ఇచ్చే నెపంతో సీఐఏ, ఐఎస్ఐలు చేతులు కలిపాయి. లక్ష్యం నెరవేరాక సీఐఏ సామాను సర్దుకొని చెప్పాపెట్టకుండా ఖాళీ చేసి వెళ్లిపోయింది. డబ్బులు ఇచ్చాం.. పని చేయించుకున్నాం అనేదే సీఐఏ పాలసీ. బలూచిస్తాన్‌లోని క్వెట్టా నుంచి పెషావర్ వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన బీఎల్ఏ తమ వద్ద ఇంకా వంద మంది బందీలుగా ఉన్నారని చెప్తుంటే.. పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రం రైలు హైజాక్ ఉదంతం సుఖాంతమైందని, బందీలందర్నీ విడిపించామని చెబుతోంది. ఇక్కడ బీఎల్ఏ, ఐఎస్ఐలు చెప్పని విషయం ఒకటి ఉంది. హైజాక్ అయిన రైలులో 184 మంది ఐఎస్ఐ, యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్‌తోపాటు పాక్ సైనికాధికారులు ఉన్నారు. వీరే బీఎల్ఏ లక్ష్యం. అందుకనే వారిని మాత్రమే బందీలుగా పెట్టుకుని వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు తదితర ప్రయాణికులను వదిలిపెట్టింది. వారినే క్వెట్టాకు తరలించిన పాక్ సైన్యం తమ ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని ప్రకటించి చేతులు దులుపుకుంది. బీఎల్ఏ మాత్రం తమ వద్ద 100 మంది బందీలుగా ఉన్నారని ప్రకటించింది. జైళ్లలో ఉన్న తమ నాయకులను విడుదల చేయాలని, ఆచూకీ లేకుండా పోయిన బలూచ్ పౌరులను కూడా విడుదల చేస్తేనే బందీలను విడుదల చేస్తామని బీఎల్ఏ అంటున్నది. పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రం 36 గంటల పాటు జరిగిన రెస్క్యూ ఆపరేషన్‌లో 36 మంది ఉగ్రవాదులను హతమార్చి బందీలను విడిపించామని ప్రకటించింది. మరోవైపు జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ వెనుక భారత నిఘా సంస్థ 'రా' హస్తం ఉందని షరా మామూలుగా పాక్ ఆరోపించింది. బ్రిటీష్ వారు భారత్‌ను విభజించి పాకిస్తాన్ ఏర్పాటు చేసినపుడు బలూచిస్తాన్ అందులో లేదు. పాక్ సైన్యం దాన్ని ఆక్రమించి తనలో కలుపుకుంది. కాశ్మీర్‌ను కూడా కలుపుకోవాలని ఆశపడి భంగపడింది. ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో కలవడానికి సిద్ధంగా ఉన్నారు. పీవోకే ప్రజల నుంచి బలమైన ఒత్తిడి వచ్చే వరకూ భారత్ వేచి ఉంటుందే తప్ప తనకు తానుగా ప్రత్యక్ష చర్యకు దిగదు. ఉక్రెయిన్‌లో భాగమైన క్రిమియాను ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) తర్వాతే పుతిన్ రష్యాలో కలిపేశారు. పీవోకే విషయంలోనూ భారత్ అదే చేస్తుంది. 36 గంటలపాటు ఆపరేషన్ నిర్వహించినా రైలులో ఉన్న తమ సైన్యాధికారులను పాక్ విడిపించుకోలేకపోయిందంటే దాని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అసలు పాకిస్థాన్‌లో మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా లేదు. దీనివల్ల తమ ఇరుగుపొరుగు దేశాల్లో ఏం జరుగుతున్నదో, ఆ దేశాల ప్రజలు, తమ మధ్య ఉన్న తేడా ఏమిటో అక్కడి ప్రజలకు తెలియడంలేదు. అలాగే బ్రిటీష్ ఇండియాలో ఉన్నప్పుడు కట్టిన రైల్వేస్టేషన్లు ఇప్పటికీ అలానే ఉన్నాయి. కనీసం ఎలక్ట్రిఫికేషన్ జరగలేదు. ఒక్క ఆటో ఇండస్ట్రీ లేదు. సుజుకి, హోండాలు తమ అసెంబ్లింగ్ యూనిట్లను మూసివేసి అయిదేళ్లు అవుతున్నది. ఉల్లిపాయలు కిలో రూ.220, టమోటా కిలో రూ.120. భారత్‌తో వాణిజ్యంపై నిషేధం విధించుకొని భారత్ నుంచి దుబాయ్ ఎగుమతి అయ్యే సరుకులను అక్కడ కొని తిరిగి పాకిస్తాన్‌లో అమ్ముతుంటే ధరలు పెరగకుండా ఎలా ఉంటాయి. చివరికి భారత్‌లో తయారయ్యే సౌందర్య ఉత్పత్తులు కూడా దుబాయ్ నుంచి దిగుమతి చేసుకొని అధిక ధరలకు కొనగోలు చేయాల్సిన దుస్థితి వారిది. 1950 నుంచి అమెరికా ఇచ్చే సహాయం మీదనే పాకిస్థాన్ నెట్టుకొచ్చింది. 2018లో ట్రంప్ సహాయం ఆపడంతో పాక్ అసలు స్వరూపం బయటపడింది. పీవోకే, సింధ్, బలూచిస్తాన్ ప్రావిన్స్‌లు ఎప్పటికైనా పాకిస్థాన్ నుంచి వేరుపడేవే. తనని తాను పోషించుకోలేని దేశం పక్క దేశాల ప్రాంతాలను కలుపుకోవాలనుకోవడం అత్యాశే. బలూచిస్తాన్ ఇరాన్‌తో సరిహద్దు కలిగి ఉన్నందున దాన్ని చైనా చేతిలోకి అమెరికా వెళ్లనివ్వదు. సీఐఏ మద్దతు లేనిదే బీఎల్ఏ ఇంత భారీ దాడి చేయలేదు. బీఎల్ఏ ఇక ముందు దాడులు తీవ్రతరం చేస్తే అవి సీఐఏ సహకారంతోనే సాధ్యం. బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా ఏర్పడితే అమెరికాకు లాభం. తన మిలిటరీ బేస్‌పే పెట్టుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో బలూచ్‌తో భారత్‌కి వచ్చేది లేదు, పోయేది లేదు పాక్ మరింత నష్టపోవడం తప్ప.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

(సత్యంన్యూస్, టెక్కలి)

పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత టెక్కలి మండలంలో జడ్.పి.హెచ్.ఎస్ బురగాంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో స్థానిక పంచాయతీ కార్యదర్శి బి బాబురావు, ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి అచ్యుత రావుల ఆధ్వర్యంలో విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు గ్రామంలో భారీగా ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కె.వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. విద్యార్థులను తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎన్.బాబురావు ప్లాస్టిక్ విని యోగంపై షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని రీసైక్లింగ్ అయ్యే ప్లాస్టిక్‌ను ఉపయోగించాలని తడి చెత్తని, పొడి చెత్తని వేరువేరుగా ఉంచి దానిని మరలా వినియోగంలో తేవాలని కొంపోస్టు ఎరువులుగా కూడా ఉపయోగించుకోవాలన్నారు. తమ ముందు ఉన్న కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, పక్కవాళ్ళపై ఆధార పడకుండా తమ చుట్టూ ఉన్న పరిసరాలను బాధ్యతాయుతంగా శుభ్రం చేసుకోవాలన్నారు. దీనివల్ల అనారోగ్యాల నుండి దూరం కావచ్చని, ఆర్థిక భారం తగ్గించుకోవచ్చన్నారు. ఆరోగ్య సిబ్బంది విద్యా ర్థులకు చేతులను శుభ్రం చేసే విధానం తెలియజేశారు. ఉపాధి కూలీలు పాఠశాల ఆవరణలో ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు అనంతరం అనంతరం పాఠశాల ఆవర ణలో మొక్కలు నాటారు కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఆరోగ్య శాఖ సిబ్బంది సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు గ్రామ పెద్దలు భారీ ఎత్తున పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాలనావ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ప్రభుత్వ పాలనావ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకమని ఇందులో పనిచేసే ఉద్యోగులు రేయింబవళ్ళు పనిచేస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరితో ఉంటారని దీన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ముందుకు వచ్చి మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం ఎంతో ముదావహం అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లాకేంద్రంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ అతిథిగృహం అధునికీకరణ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారులు అంకితభావంతో పనిచేయటం వల్ల భూమి సమస్యలు లేని జిల్లాగా శ్రీకాకుళం జిల్లాను తయారుచేస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేసే మొదటి శాఖ రెవెన్యూశాఖ అని కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఎన్నోఏళ్లుగా చక్కని సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, రాష్ట్రానికి ఒక మోడల్‌గా శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ శాఖ నిలుస్తుందన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని రెవెన్యూశాఖ కుటుంబసభ్యులు అంతా వినియోగించికోవాలని కలెక్టర్ కోరారు. 20 రకాల వైద్య పరీక్షలు ఈ క్యాంప్‌లో ఏర్పాటు చేయడం వల్ల ప్రతీ ఒక్కరూ విధిగా ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీరాములు బి.వి.ఎస్.ఎన్.రాజు, పొదిలాపు శ్రీనివాసరావు, ప్రవల్లిక, కలెక్టరేట్ పరిపాలన అధికారి గుడ్ల సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో వైద్య సదుపాయాలు అవసరం

(సత్యంన్యూస్, సీతంపేట)

గిరిజన గ్రామాల్లో వైద్య సదుపాయాలు అవసరమని బిహెచ్ ఆర్సీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి శనివారం తెలిపారు. సీతంపేట ఆదివాస గ్రామ ప్రజలకు పూర్తిగా దేనిమీద అవగాహన లేకపోవటం బాధాకరమని, వీరికోసం భారతీయ మానవ హక్కుల శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో సీతంపేట గిరిజన గ్రామంలో శానిటరీ నెఫ్కిన్స్ పంపిణీ, ఉచిత మెగా వైద్యసదుపాయం నిర్వహించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు అందరికీ ఆదర్శం కావాలని, ప్రతీ కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యవాతావరణం నెలకొంటుందన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మణిశర్మ మాట్లాడుతూ గిరిజన మహిళల ఆరోగ్య రీత్యా శానిటరీ నాప్‌కిన్స్ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఆరోగ్యసూత్రాలతోపాటు వాటి వినియోగ ఉపయోగాలను వివరించామని, రానున్న రోజుల్లో వీరి అవసరాలకు అండగా నిలుస్తామన్నారు. శ్రీకాకుళం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య పట్నాయక్ వస్త్రధారణ, ఎదుటివారి పట్ల ఎలా మెలగాలి, ఎలా మాట్లాడాలి, ఎలా నడుచుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.మణికంఠ మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య సేవలను రాగోలు జెమ్స్ వైద్యశాల సహకారంతో నిర్వహించామని, వారికి అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచిత మందులను అందజేశామన్నారు. ఇంత మారుమూల గిరిజన గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు చాలా అవసరమని, వీరికి కనీస వైద్య సదుపాయాలూ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ప్రమీల సౌజన్యంతో అన్నదానం నిర్వహించామని, కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలని, గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న పేదలకు మనమంతా అండగా నిలవాలని జాతీయ చైర్మన్ డా.ప్రభు అన్నారు. ఈ మహోత్తర కార్యక్రమంలో భారతీయ మానవ హక్కుల శ్రీకాకుళం జిల్లా అధికారులతోపాటు సభ్యులు, జెమ్స్ వైద్యశాల సిబ్బంది, సీతంపేట గిరిజన ప్రజలు, పిల్లలు పాల్గొన్నారు.






# మనసుకు తాకలేదు!

తన ఫ్లాప్ స్ట్రీక్‌కు బ్రేకులేస్తూ గత ఏడాది 'క' చిత్రంతో మంచి విజయాన్నందుకున్నాడు యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం. ఇప్పుడు అతడి నుంచి వచ్చిన కొత్త చిత్రం.. దిల్ రూబా. డెబ్యూ డైరెక్టర్ విశ్వ కరుణ్ రూపొందించిన ఈ ప్రేమ కథా చిత్రం ఈ రోజే ప్రేక్షకులను పలకరించింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:** సిద్ధు (కిరణ్ అబ్బవరం) జీవితంలో ఒకేసారి రెండు గట్టి ఎదురు దెబ్బలు తిన్న కుర్రాడు. తన నుంచి సాయం పొందిన వ్యక్తే మోసం చేయడంతో సిద్ధు తండ్రి ఆత్మహత్య చేసుకుని చనిపోగా.. ఆ సమయంలో తన వెంట నిలుస్తుందని ఆశించిన గర్ల్ ఫ్రెండ్ మ్యాగి (ఖ్యాతి డేవిడ్సన్) అతణ్ని అపార్థం చేసుకుని వేరే పెళ్లి చేసుకుని దూరమవుతుంది. దీంతో మనుషుల మీద.. ముఖ్యంగా అమ్మాయిల మీద ద్వేషం పెంచుకుని ఉన్న ఊరు విడిచిపెట్టి మంగళూరుకు వెళ్లిపోతాడు సిద్ధు. అక్కడ అతడికి అంజలి (రుక్సర్ థిల్లాన్) పరిచయం అవుతుంది. ఆమెకు సిద్ధు నచ్చి తన వెంటపడుతూ ఉంటుంది. కొంత కాలానికి సిద్ధుకు కూడా ఆమె నచ్చుతుంది. ఇద్దరూ ప్రేమలో పడి అంతా సాఫీగా సాగుతున్న సమయంలో.. సిద్ధు వ్యవహార శైలి వల్ల ఇద్దరి మధ్య సమస్యలు మొదలవుతాయి. తన తీరు మార్చుకోమని అంజలి ఎంత చెప్పినా సిద్ధు వినిపించుకోడు. దీని వల్ల అతనేం కోల్పోయాడు.. చివరికి అతను మారాడా లేదా.. చివరికి సిద్ధు-అంజలి జంట కలిసిందా లేదా అన్నది మిగతా కథ.

**నటీనటులు:** కిరణ్ అబ్బవరం లవర్‌బాయ్ పాత్రలో ఆకర్షణీయంగా కనిపించాడీ చిత్రంలో. ఇప్పటిదాకా కెరీర్లో తనకిది బెస్ట్ లుక్ అని చెప్పొచ్చు. ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు. డ్యాన్సులు.. ఫైట్లలో ఆకట్టుకున్నాడు. కానీ ఆవేశం చూపించాల్సిన సన్నివేశాల్లో డైలాగ్ డెలివరీ మాత్రం పర్ఫెక్టుగా లేదు. రుక్సర్ థిల్లాన్ చూడ్డానికి బాగుంది. తన పెర్ఫామెన్స్ కూడా ఓకే. సెకండ్ హీరోయిన్ ఖ్యాతి డేవిడ్సన్ పర్వాలేదు. విలన్ పాత్ర చేసిన జాన్ విజయ్ గురించి చెప్పడానికేమీ లేదు. ఆయన్ని ఇలాంటి పాత్రల్లో.. నటనతో చాలా సినిమాల్లో చూశాం. సత్య కామెడీ కొంత నవ్వించింది. కానీ 'మత్తు వదలరా-2' తర్వాత తన నుంచి ఇంకా ఎక్కువ నవ్వులు ఆశిస్తాం. ఆడుగళం నరేన్.. ఆనంద్.. తులసి.. సమీర్.. వీళ్లంతా పాత్రల పరిధి మేర నటించారు.

**సాంకేతిక వర్గం:** సామ్ సీఎస్ పాటల్లో 'హే జింగిలి' ప్రత్యేకంగా అనిపిస్తుంది. మిగతా పాటలు కూడా ఓకే. బ్యాగ్రౌండ్ స్కోర్ విషయంలో సామ్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. లవ్ సీన్లలోనే కాక.. యాక్షన్ ఎపిసోడ్లలో కూడా బీజీఎం ఆకట్టుకుంటుంది. డేనియల్ విశ్వాస్ ఛాయాగ్రహణం ఓకే. మంగళూరు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్లెజెంట్ గా అనిపిస్తాయి. ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ విశ్వ కరుణ్ ఎంచుకున్న కథలో ఏమంత కొత్తదనం లేదు. ఎగ్జిక్యూషన్ కూడా సోసోగా అనిపిస్తుంది. అతను డైలాగుల వరకు మెప్పించాడు. లవ్ స్టోరీ వరకు ఓ మోస్తరుగా డీల్ చేసినా.. ఈ కథకు యాక్షన్ టచ్ ఇవ్వడానికి చేసిన ప్రయత్నంలో అతను గాడి తప్పేశాడు.

**కథనం-విశ్లేషణ:**

"అవసరం తీరాక చెప్పే థ్యాంక్స్‌కు.. తప్పు చేశాక చెప్పే సారీకి నా దృష్టిలో విలువ లేదు".. 'దిల్ రూబా'లో హీరో చెప్పే ఫిలాసఫీ ఇది. ఈ సినిమా నడిచేదే ఈ పాయింట్ మీద. కానీ ఎవ్వరైనా థ్యాంక్స్ ఎందుకు చెబుతారు? ఒక అవసరం తీరాకే కదా. మరి సారీ ఎప్పుడు చెబుతారు? తప్పు చేసినపుడే కదా. కాబట్టి ఈ డైలాగ్‌లో లాజిక్ కనిపించదు. 'దిల్ రుబా'లో హీరో పాత్ర చిత్రణ కూడా ఈ డైలాగ్ లాగే ఉంటుంది. తన జీవితంలో ఏదో ఒక విషాదం చోటు చేసుకుందని.. ఒకరు మోసం చేశారని.. ఇంకొకరు అపార్థం చేసుకున్నారని.. ఒక ఫిలాసఫీ రాసుకుని "నేను థ్యాంక్స్ చెప్పను.. సారీ చెప్పను" అంటూ మొండిపట్టు పట్టుకుని కూర్చోవడం అర్థరహితంగా అనిపిస్తుంది. మూర్ఖంగా ప్రవర్తించే హీరో పాత్రతో కనెక్ట్ కావడం చాలా కష్టం. అలాంటపుడు ఆ పాత్రతో ఎలా ట్రావెల్ అవుతాం.. తన కథతో ఎలా రిలేట్ అవ్వగలం? అక్కడక్కడా కొన్ని ఇంట్రెస్టింగ్ సీన్లు ఉన్నా.. డైలాగులు పేలినా.. పాటలు కూడా ఆకట్టుకున్నా.. ఓవరాల్‌గా చూస్తే 'క' తర్వాత కిరణ్ అబ్బవరం నుంచి ఆశించే సినిమా కాదు 'దిల్ రూబా'.

'దిల్ రూబా'లో ఒక సీన్లో హీరో అర్ధరాత్రి హీరోయిన్ తో కలిసి బీచ్ లో కార్లో కూర్చుని ఉంటాడు. అప్పుడక్కడికి పోలీసులు వస్తారు. ఎవరా అమ్మాయి అని సీఐ అడిగితే.. "నా పెళ్లాం, బర్త్ డే చేసుకోవడానికి ఇక్కడికొచ్చాం" అంటాడు హీరో. అప్పుడు ఆ అమ్మాయి నా కూతురురా అంటూ చావు కబురు చల్లగా చెబుతాడు సీఐ. ఎంత బ్రాడ్ మైండెడ్ ఫాదర్ అయినా సరే.. అర్ధరాత్రి వేళ ఒక అబ్బాయితో బీచ్‌లో తన కూతురు కనిపిస్తే ఎలా రియాక్ట్ అవుతాడో మనకొక అంచనా ఉంటుంది. కానీ ఆ తండ్రి మాత్రం కూల్‌గా హీరోతో సంభాషణ జరుపుతుంటాడు. హీరోయిన్ ఇంకా కూల్‌గా తండ్రి పక్కకు వచ్చి నిలబడుతుంది. వీళ్ల పాత్రలే ఇలా ఉన్నాయనుకుంటే.. తన మాజీ లవర్ లవ్ స్టోరీ ఇబ్బందుల్లో ఉందని దాన్నిచక్కబెట్టడం కోసం ఆర్నెల్ల ప్రెగ్నెంట్ అయిన అమ్మాయి యుఎస్ నుంచి ఇండియాకు వస్తుంది. ఆ మాజీ లవర్ కాలేజీలోనే గెస్ట్ లెక్చరర్‌గా చేరుతుంది. తన ఇంట్లోనే తిష్ట వేస్తుంది. ఆమె భర్త.. భార్య మాజీ లవర్ కు ఫోన్ చేసి తను జాగ్రత్త బ్రో అంటాడు.

ఇలాంటి పాత్రలు.. సన్నివేశాలు చూసి ఎలా రియాక్టవ్వాలో అర్థం కాదసలు. పాత్రలేమో ఇంత 'అల్ట్రా మోడర్న్'గా ఉంటే.. 'దిల్ రూబా' కథేమో చాలా పాతగా అనిపిస్తుంది. 'దిల్ రూబా'లో కేవలం ప్రేమ కథ వరకు చూస్తే మెరుగ్గానే అనిపిస్తుంది. బ్రేకప్ తాలూకు బాధతో మొదలయ్యే హీరో కథ ఆరంభంలో ఆసక్తికరంగానే అనిపిస్తుంది. మొదట్లో కొన్ని సన్నివేశాలు.. డైలాగులు.. చూస్తే బాగా డెప్త్ ఉన్న లవ్‌స్టోరీ చూడబోతున్న సంకేతాలు కనిపిస్తాయి. మంగళూరు నేపథ్యంలో ప్లెజెంట్ విజువల్స్‌తో కొంత వరకు దర్శకుడు సినిమాను బాగానే నడిపించాడు. రుక్సర్ థిల్లాన్ క్యారెక్టర్.. ఆమెతో హీరో జర్నీ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను బాగానే ఎంగేజ్ చేస్తాయి. ఐతే సాఫీగా సాగిపోతున్న ప్రేమకథలోకి విలన్ని తీసుకొచ్చి యాక్షన్ టచ్ ఇద్దామని చేసిన ప్రయత్నమే బెడిసికొట్టింది. ఇందులో విలన్ పాత్ర పేరు.. జోకర్. జాన్ విజయ్ చేసిన ఆ పాత్ర నిజంగా 'జోకర్'ను తలపించేలా ఉంటుంది. మొదట్లో ఆ పాత్రకు ఇచ్చే బిల్డప్ కి.. తర్వాత ఆ పాత్ర ప్రవర్తించే తీరుకు అసలు పొంతన ఉండదు. ఈ కథలో ఆ పాత్ర అస్సలు సింక్ కాలేదు. సన్నివేశాలు. ఓవైపు హీరో-హీరోయిన్ల మధ్య గొడవ.. ఎడబాటు.. అపార్థాలు.. ఇవన్నీ కూడా ఏమాత్రం ఆసక్తి రేకెత్తించని విధంగా సాగుతుంటే.. ఇంకోవైపు విలన్ ట్రాక్ విసిగిస్తుంది. దీని వల్ల ద్వితీయార్థంలో 'దిల్ రూబా' పూర్తిగా ట్రాక్ తప్పేసింది. ఇటు ప్రేమకథా చెడిపోయి.. అటూ యాక్షన్ టచ్ ఉన్న అంశాలూ రంజిపజేయక చివరికి 'దిల్ రూబా' రెంటికీ చెడ్డట్లు తయారైంది. ప్రథమార్థంలో లవ్ స్టోరీ.. పాటలు.. కిరణ్-రుక్సర్ మధ్య వచ్చే కొన్ని సన్నివేశాల కోసం 'దిల్ రూబా'పై ఓ లుక్కేయొచ్చు కానీ.. అంతకుమించి ఆశిస్తే కష్టం. - తుపాకి.కామ్ సౌజన్యంతో...

## కొబుసుల కొత్తూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతినెల 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ఎన్.ఎస్.ఎస్, ఉన్నత భారత అభియాన్, యస్.ఎ.సి ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు గడపగడపకు వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాల హాని గురించి అవగాహన పెంచే ప్రచార ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించి, పునర్వినియోగపరిచే విధంగా ఉండే వస్తువులను ప్రోత్సహించేలా గ్రామ ప్రజలకు సూచనలు అందించారు. ముఖ్యంగా కాగితపు సంచులు, జూట్‌బ్యాగులు, స్టీల్, కాంపోస్టబుల్ వస్తువులను ఉపయోగించాలనే సందేశాన్ని ప్రచారం చేశారు. మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.వి మారుతి ప్రసాద్, గోపాలకృష్ణ, సురేష్, సుధాకరరావు లు పాల్గొన్నారు.




## క్షేత్రపరమైన చదువు అవసరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులకి పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగాలకు సంబంధించిన క్షేత్ర జ్ఞానం అవసరమని గురజాడ విద్యా సంస్థల డైరెక్టర్ సంయుక్త అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల జీవశాస్త్ర విభాగాలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో నిర్వహణలో విద్యార్థుల నిబద్ధతను కొనియాడారు. ఎక్స్‌పోను శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల జీవిశాస్త్ర విభాగాధిపతి ఎం.ప్రదీప్ ప్రారంభించారు. విద్యార్థులు చేసిన వివిధ ప్రయోగాలను చూశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ, ఐ.క్యూ.ఏ.సి. డాక్టర్ మార్థండకృష్ణ, సీతారాంనాయుడు, ధన్వంతరి, ఉమామహేశ్వరి, తనూజా, బాలసుందర్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల పెన్నిధి షాజీ వర్గీస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అండమాన్ నికోబార్ దీవుల్లోని ప్రముఖ డాక్టర్. షాజీ వర్గీస్ గారు గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ సర్వీస్ లో ఉంటూ ప్రాక్టీస్ చేస్తూ అండమాన్ నికోబార్ దీవుల్లో ఉన్న ఉత్తరాంధ్ర ప్రజలకి, అలాగే మన రాష్ట్ర తెలుగు ప్రజలకి అండగా ఉంటూ, పేద ప్రజలకు ఫ్రీ సర్వీస్ చేస్తూ, ముఖ్యంగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, అండమాన్ నికోబార్ దీవులు రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు మాణిక్యాలరావు యాదవ్, అండమాన్ నికోబార్ దీవుల్లో వున్న ఉత్తరాంధ్ర ప్రజలు అలాగే తెలుగు ప్రజలకు ఏ కష్టం వచ్చినా డాక్టరకు తెలియపరచిన వెంటనే స్పందించి వారికి అండగా నిలబడుతూవారి సర్వీస్‌లో ఇప్పటివరకు సుమారుగా 11500 సర్జరీలు చేసి ఉత్తమ సేవలు అందించారు. అటువంటి సమాజ సేవకునికి జాతీయ స్థాయిలో అవార్డులు రావాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు భావిస్తున్నారు. దీనిలో భాగంగా డాక్టర్ షాజీ వర్గీస్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న మహానాడు లాంటి కార్యక్రమాలలో వారు సేవలను మన రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకునే విధంగా కోరు తానన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నతుంగాం, సంతబొమ్మాళి గ్రామపంచాయతీల పరిధిలోని చిన్నతుంగాం ఎంపీ ఇపీ స్కూల్ పరిధిలో, సంతబొమ్మాళి కేజీబీవీ స్కూల్ పరిధిలో పరిశుభ్రత మరియు ప్లాస్టిక్ /పాలిథిన్ కవర్స్ నివారణపై అవగాహన గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.తిరుమల రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.జయంత్‌ప్రసాద్, సంతబొమ్మాళి మండల పరిషత్ ఈఓపీఆర్డీ ఐ పద్మజ, సర్పంచ్‌లు శిమ్మ గోవింద రావు, కళింగపట్నం లక్ష్మి, సంతబొమ్మాళి మాజీ సర్పంచ్ కె.కాంతారావు, పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాసరావు, తాళ్ళవలస పంచాయతీ కార్యదర్శి జి.విజయ్ కుమార్, గ్రామ సచివాలయాల సిబ్బంది, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు

– సత్యంన్యూస్, సంతబొమ్మాళి

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పదోతరగతి పరీక్షలకు ఈ నెల 15న హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అక్షయ సేవాసమితి సభ్యులు అన్నారు. శ్రీకాకుళం హయతి నగరం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ-నివాస బాలికల పాఠశాల, ఎచ్చెర్ల మండలం కుశాలపురం, తోటపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అక్షయ సేవాసమితి అధ్యక్షులు బొడిగి మధు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాదని, ఇక్కడ ఉత్తమ మార్కులుతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రహ్మ జ్యోతిమ్యులు పొన్నాడ లక్ష్మణ రావు, సేవాసమితి సభ్యులు గోపాల్‌రావు, బ్రహ్మాజీ, సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్, మణికుమార్, జై కృష్ణ, అనిల్ కుమార్, గణపతి రావు, మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)


స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అల్లినగరం సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్ ప్రతినిధి, ఎంపీటీసీ, సీనియర్ నాయకులు కూటమి నాయకులు, బీజేపీ నాయకులు మాడుగుల శ్రీనివాసరావు, అల్లినగరం బీజేపీ 248 బూత్ అధ్యక్షులు మాడుగుల సన్యాసిరావు, 249 బూత్ అధ్యక్షులు కామర్స్ గణేష్, ఉపాధి హామీకార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిరోజు కొంత సమయం పరిశుభ్రతకు కేటాయించాలని అదేవిధంగా అల్లినగరంలో ఉన్న పాన్‌షాపులకి, టీషాపులకు వెళ్లి ప్లాస్టిక్ వాడడం పూర్తిగా నిషేధించా లని చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి-భూమిని కాపాడండి, పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతని, ప్రకృతిని ప్రేమిద్దాం భవిష్యత్తుని పరిరక్షిద్దాం అని చెప్పించారు.



## ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, బూర్జ)

జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటీడీఏని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో గిరిజన గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో లక్షకుపైగా గిరిజనులు ఉన్నారని, షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గిరిజన భూములను గిరిజనేతరులు, ఇతరులు తప్పుడు పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించుకుంటున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజనుల పండించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పండించిన జీడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల రూపాయలు చెల్లించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో గిరిజన సంఘ నాయకులు ఎస్.కృష్ణారావు, లక్ష్మణ రావు, సింహాచలం, సురేష్, రాజారావు, ధర్మారావులు పాల్గొన్నారు.



## స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాకారం

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధిద్దామని, తద్వారా స్వర్ణాంధ్ర సాకారం అవుతుందని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు విద్యార్థులనుద్దేశించి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధి హామీ శ్రామికులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి ఈఓపీఆర్డీ బి.రామారావు, పంచాయితీ కార్యదర్శి ఎస్.ఢిల్లీశ్వరరావు, సచివాలయ సిబ్బంది కె.సుస్మిత, ఎస్.స్నేహ, ఐ.దీపికలు పాల్గొన్నారు.



## పండిత సమస్యల పరిష్కారానికి కృషి చేయండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు, హిందీ భాషా పండితులు, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీకాకుళం హిందీ ఫోరమ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం నగరానికి విచ్చేసిన సందర్భంగా హిందీ ఫోరమ్ ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం డీఈఓ పూల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న హిందీ పండితులకు విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు ఐ.సంతోష్‌కుమార్‌తోపాటు ప్రతినిధులు జి.వీరాస్వామి, జి.సూర్యారావు, బి.భానుమూర్తి, బి.కిరణ్, ఎస్‌టీపీయూ శిరీష తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి టౌన్ పరిధి ఎన్టీఆర్ కాలనీ స్కూల్ సమీపంలో ఉన్న మెయిన్ డ్రైనేజ్ గత ఆరు సంవత్సరాలుగా మట్టి క్లీన్ చేయడం లేదు వ్యర్థాలు నిల్వ ఉండి కుళ్ళి భరించలేని దుర్గంధం వేస్తుందని క్లాసుల్లో ఉండలేక పోతున్నామని చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపు భరించలేకపోతున్నామని వెంటనే వీధిలో ఉన్న మెయిన్ డ్రైనేజ్ మట్టి మొత్తం తొలగించి క్లీన్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– సత్యంన్యూస్, టెక్కలి

## గాంధీ మందిరాన్ని దర్శించిన స్కౌట్స్ బృందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశం కోసం ధర్మం కోసం స్వాతంత్ర స్ఫూర్తిని సేవా నిరతిని బాల్యం నుంచే అలవర్చుకునేందుకు నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతివనం సందర్శనం ఎంతగానో దోహదపడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రజియా బేగం, నాగిరెడ్డి అన్నారు. జిల్లావ్యాప్తంగా స్కౌట్స్ బృందాలు వారికి సమన్వయం చేసే స్కౌట్ అధికారులతో కలిసి గాంధీ మందిరాన్ని సందర్శించారు. జిల్లా స్కౌట్ సమన్వయకర్తలు రాజేంద్రప్రసాద్, వాగ్దేవి, బుజ్జి తోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చినవారు సమరయోధుల స్మృతివనంలో కొలువుదీరిన మహనీయుల చరిత్రను ఒక్కొక్కరిది విద్యార్థులకు వివరించారు. దేశంలో తాము ఎక్కడ ఇంతటి గొప్ప ప్రదేశాన్ని చూడలేదని స్కౌట్ రాష్ట్ర కార్యదర్శిలు రజియా బేగం, నాగిరెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్వాతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్తలు, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అందరిని ఒకేచోట ప్రతిష్టించడం తోపాటు 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాన్ని సగర్వంగా ఎగురవేసి జాతిపిత గాంధీజీ ఆశయాన్ని సజీవం చేస్తున్న నిర్వాహక బృందాన్ని, సహకరించిన జిల్లా ప్రజలకు, దాతలకి అభినందించారు. భావితరాలకు దేశం పట్ల బాధ్యతను పెంచే గొప్ప పుణ్యక్షేత్రంగా తాము భావిస్తున్నామన్నారు. స్కౌట్ విద్యార్థులకు స్వాతంత్రోద్యమంలో సైనికుల తిరుగుబాటు మొదలు నేటి వరకు ఉన్న పరిస్థితులను వారికి వివరించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి సామూహికంగా రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తనలు ఆలపించారు



## పొన్నాడ సీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తోటపాలేం గ్రామంలో ప్రతినెలా మూడవ శనివారం విలేజ్ హెల్త్ క్లినిక్ లోపల, బయట పరిసరాల్లో పట్లు దులిపి, పిచ్చి మొక్కలును, ప్లాస్టిక్ కవర్లు, సీసాలను తొలగించి పరిశుభ్రం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంపై ప్రజలంతా అవగాహన కలిగి ఇళ్లు, ఖాళీ ప్రదేశాల్లో శుభ్రం చేయడం ద్వారా ప్రజారోగ్యానికి హాని కలిగించే దోమలు, వాటి ద్వారా వ్యాప్తిచెందే అంటువ్యాధులు నుండి రక్షించుకోవచ్చని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం. ఉషశ్రీ ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రం పరిధిలోని 12 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో కూడా ఈకార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ జి.కమల, ఆశా కార్యకర్తలు కళావతి, విజయ, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.



## మహాగణపతి యంత్ర ప్రతిష్టలో కేంద్రమంత్రి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రూరల్ మండలం కల్లేపల్లి శ్రీ గౌరీ సమేత మణి నాగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ మహాగణపతి యంత్ర ప్రతిష్టలో కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలరాముడు స్థాపించిన ఈ దేవాలయంలో మహాగణపతి, దత్తాత్రేయ, శిరిడి సాయినాథుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా యంత్ర ప్రతిష్ట విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వేద పండితుల వేదమంత్రాలు నడుమ శాస్త్రయుక్తంగా జరుగుతున్నాయన్నారు. ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం గొప్ప విషయమని రామ్మోహన్ నాయుడు, శంకర్‌లు తెలిపారు. నాడు బలరాముడు నడియాడే ప్రాంతంగా స్థలపురాణం చెబుతుందని, ఇటువంటి ప్రదేశంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగడం శుభ పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రలో భాగంగా బీఆర్ఆర్ వంశధార సర్కిల్ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పీవి తిరుపతిరావు, డిప్యూటీ పర్యవేక్షక ఇంజనీరు ఆర్.రామచంద్రరావు, సర్కిల్ సూపరెంటెండెంటు ఆర్.గోవిందా పట్నాయక్‌లతోపాటు పెద్దసంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం











## CHANGE OF NAME

నేను, మొహమ్మద్ అహ్మదునిష్ బేగం W/o ఖాదర్ మొహిద్దీన్ ఖాన్ గతంలో మొహమ్మద్ అహమదున్నీసా బేగం అని పిలిచేవారు. చిరునామా: W/o ఖాదర్ మొహిద్దీన్ ఖాన్, ఫ్లాట్ నెం-4, శాంతి నిలయం, ఎస్.ఎ.టి. నగర్, తోటపాలెం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ -532005. ఇప్పటి నుండి నా పేరును మొహమ్మద్ అహమదున్నీసా బేగం నుండి మొహమ్మద్ అహ్మదునిష్ బేగంగా మార్పు చేయించుకున్నాను. కనుక నేను ఇక నుండి అన్ని విధాలుగా మొహమ్మద్ అహ్మదునిష్ బేగంగా పిలవబడతాను.


# చెరువును చెరబట్టి.. ప్లాట్లుగా విడగొట్టి..!

మొదటిపేజీ తరువాయి

రికార్డులను ట్యాంపరింగ్ చేయించారని ఆయనపై అభియోగాలు ఉన్నాయి. ఆ క్రమంలోనే మాలబంద చెరువును జిరాయితీ భూమిగా మార్చేశారని పలాసలో చర్చ జరుగుతోంది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల రీ సర్వేలో ఎల్‌పీ నెంబర్ కేటాయించి చెరువును జిరాయితీగా చూపించి పక్కా చేసేశారు. మాలబందను రూ.33 లక్షలకు అయన కుటుంబ సభ్యుల నుంచే నాయుడు కొనుగోలు చేశారని పలాసలో ప్రచారం జరుగుతోంది. దీంతో 23 ఏళ్లగా దాని జోలికి వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పూర్తి స్వాధీన హక్కులు కలిగి ఉన్నట్టు రెవెన్యూ రికార్డులు సృష్టించుకున్న నాయుడు నుంచి పలాసకు చెందిన టీడీపీ నాయకుడు శంకర్ దాన్ని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

**రెవెన్యూ అధికారుల అండతో..**

రికార్డుల్లో మాలబంద చెరువుగా చూపిస్తున్నా స్థానికులు మాత్రం డబ్బాల చెరువుగా పిలుస్తుంటారు. జీడిపిక్కల పార్శిల్‌కు వినియోగించే వందలాది డబ్బాలను ఈ చెరువులోనే శుభ్రం చేసేవారని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు ఈ చెరువును ఉదయపురం, శాసనాం, మొగిలిపాడు, పురుషోత్తపురం గ్రామాల వారు తాగునీటికి, పశువుల అవసరాలకు వినియోగించేవారని స్థానికులు చెబుతున్నారు. కాలక్రమేణా దీన్ని తమ స్వాధీనంలో ఉంచుకొని, ఆతర్వాత కాలంలో సీసీఎల్‌ఏ స్థాయిలో రికార్డులు మార్చించి వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదుచేసి చెరువును జిరాయితీగా మార్చేశారు. 2002 టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నాయుడు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉండేవాడు. అక్కడి నుంచే వ్యవహారమంతా నడిపేవాడు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాలబందను లైన్‌లో పెట్టాలని ప్రయత్నించాడు. మున్సిపాలిటీ కాంగ్రెస్ చేతిలోకి వచ్చిన తర్వాత కౌన్సిలర్లను మచ్చిక చేసికొని చెరువును కొట్టేయాలని ప్రయత్నించాడు. దీన్ని కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో స్థానిక ఎమ్మెల్యేతో రాయబారం నడిపించాడు. అయినా వారు అంగీకరించలేదు. దీంతో సీసీఎల్‌ఏ నుంచి పనికానిచ్చి రికార్డులు మార్పించేసిన నాయుడు తన పేరుతో వన్-బీ అడంగల్‌ను తయారుచేయించి రెవెన్యూ అధికారులతోనే స్వాధీనహక్కులు పొందాడు. 23 ఏళ్ల తర్వాత ఇప్పుడు మాలబందను కంకరతో కప్పి ప్లాట్లుగా విభజించే ప్రక్రియ పునఃప్రారంభించారు. పలాస ఆర్డీవో కార్యాలయం నుంచి తహసీల్దారుకు ల్యాండ్ కన్వర్షన్ ఫైల్ పంపించి సంతకాలు పెట్టించి నాలా కట్టించేశారు. నాలా కట్టిన అక్రమార్కులు దర్జాగా చెరువును ప్లాట్లుగా విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగి సంతకు కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా నడిచిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


## CHANGE OF NAME

నేను, ఖాదర్ మొహిద్దీన్ ఖాన్ S/o ఎం డి అమీరుద్దీన్ గతంలో మొహమ్మద్ కాదర్ మొహిద్దీన్ ఖాన్ అని పిలిచేవారు. చిరునామా: S/o ఎం డి అమీరుద్దీన్, ఫ్లాట్ నెం-4, శాంతి నిలయం, ఎస్.ఎ.టి.నగర్, తోటపాలెం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ -532 005. ఇప్పటి నుండి నా పేరును మొహమ్మద్ కాదర్ మొహిద్దీన్ ఖాన్ నుండి ఖాదర్ మొహిద్దీన్ ఖాన్‌గా మార్పు చేయించుకున్నాను. కనుక నేను ఇక నుండి అన్ని విధాలుగా ఖాదర్ మొహిద్దీన్ ఖాన్‌గా పిలవబడతాను.


## అరసవిల్లిలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ అధికారుల ఆదేశాలతో నగర బీసీ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో అరసవిల్లిలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉంగటి పాపారావు, రామ్మోహన్, గొలివి దామోదర్, గొలివి రమణ, రాయపిల్లి అర్జున్, దండాసి జ్యోతిభాస్కర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరసవిల్లిలో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలోని పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, సచివాలయం సెక్రటరీ మురళీ, బట్న రవితేజ, విఆర్ఓ లీలాప్రసన్న, శానిటేషన్ సెక్రెటరీ లక్ష్మినారాయణ, ఏఎన్ఎం కుమారి, ఆశ వర్కర్ భారతి, ఆర్‌పీలు సరస్వతి, రూప, లీలా, స్వాతి తదితరులు పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని ప్రతి ఒక్కరు నిర్మూలించాలని, ప్లాస్టిక్ కేన్సర్ కారకమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమం చేస్తున్నట్టు తెలిపారు. హెచ్‌ఎం భరద్వాజ్, 26వ డివిజన్ సచివాలయ సిబ్బంది అరసవిల్లి ఎంహెచ్ స్కూల్‌లో పిల్లలకు అవగాహన కల్పించారు. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులకు 52 ప్లాంక్స్‌ను అందించారు. కార్యక్రమంలో రాయపిల్లి అర్జున్, దండాసి జ్యోతిభాస్కర్, మహిళలు, విద్యార్థులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంహెచ్‌ఎస్‌లో 'ఆల్ ద బెస్ట్'

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మెట్టెక్కివలస ఎంహెచ్‌ఎస్ స్కూల్‌లో ఈ నెల 17 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు మోటివేషన్ చేస్తూ ఆల్ ద బెస్ట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు మురళీధర్ యాదవ్, దూసి సీతారాం, హెచ్ఎం, ఉపాధ్యాయులు, నాయకులు లంక నారాజు, బి.రాజేంద్ర, మాలిక్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## నాటడంతో పాటు మొక్కలను పరిరక్షించాలి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతోనే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో 'స్వర్ణఆంధ్ర -స్వచ్ఛఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాలుపంచుకున్నారు. ఈ క్రమంలో తహసిల్దార్ కార్యాలయంలో 16 మొక్కలను స్వయంగా నాటారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అధికారులు, కూటమి నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రమణమూర్తి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల తహశీల్దార్, ఎంపీడీవో, కూటమి నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తుమ్మావీధిలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో కమిషనర్ పీవీవీ ప్రసాదరావు, మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ సుధీర్ ఆదేశాల మేరకు ప్రతీ నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు తుమ్మావీధిలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ఆవరణలో డీసీసీబీ సచివాలయం ఉద్యోగులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. 11వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి జోగ నూకరాజు యాదవ్, 10వ వార్డు ఇన్‌ఛార్జి బలగ శివప్రసాద్‌దేవ్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సచివాలయం అడ్మిన్ శరత్, శానిటేషన్ సెక్రటరీ సతీష్, మౌనిక, రాజశేఖర్, మనీషా, ఉదయ్, స్థానిక టీడీపీ నాయకులు, మౌళి, ఈశ్వరరావు, ఆర్పీలు జ్యోతి, టి.గౌరిపద్మజ, స్థానిక ఎస్‌హెచ్‌జీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని స్వచ్ఛభారత్‌పై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.








## పరిసరాల పరిశుభ్రత అవసరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రూపొందించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం శ్రీకాకుళం రూరల్ మండలం, కిష్టప్ప పేట, సింగుపురం మార్కెట్, గార మండలం వమరవెల్లి డైట్ కళాశాల, శ్రీకాకుళం పట్టణంలోని సాయినగర్ కాలనీ, ప్రాంతాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించుకోవచ్చన్నారు. పారిశుధ్యం ఎంతో మెరుగవుతుందని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది, డైట్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ క్లాస్ రూమ్ సామగ్రి అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ బెంగళూరు సహకారంతో ఎడ్యుకేట్ ఫార్వర్డ్ వారు రణస్థలం మండలంలోని అర్జునవలసజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లావేరు మండలంలోని బెజ్జిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌కు అవసరమైన లక్ష రూపాయలు విలువ గల ప్రొజెక్టర్, లాప్టాప్, స్క్రీన్, స్పీకర్స్‌ను అందజేశారు. మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాధరావు, బి.లావణ్య, వైసీబీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రసాదరావు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. భాస్కరరావుకు, ఎస్.రమణకు అందజేసి స్మార్ట్ క్లాస్‌రూమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీబీ ఐఎల్‌పీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.మాధవి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల సెక్రటరీ సిహెచ్ జనార్ధనరావు, బెజ్జిపురం యూత్ క్లబ్ కమ్యూనిటీ నిర్వాహకులు వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, ఐ.రాధ, వై.వాసంతి పాల్గొన్నారు. స్మార్ట్ క్లాస్‌రూమ్ ఇన్‌ఛార్జిగా బి.నరసింహులు, పి. గోపాలరావులను నియమించారు.



## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత

(సత్యంన్యూస్, రేగిడి)

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యతని ఎంపీడీఓ శ్యామలకుమారి, తహసీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం రేగిడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో విద్యార్థులు, గ్రామ ప్రజలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి ఏవీ సత్యనారాయణ, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ, ఏపీఎం గోవిందరావు, కార్యదర్శి స్రవంతి, క్లాప్స్ మిత్రలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ, ర్యాలీలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ, తహసీల్దార్, మండల కో ఆర్డినేటర్, సిబ్బంది పాల్గొన్నారు.



టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో టెక్కలి సూపరింటెండెంట్ సూర్యారావు, డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో హాస్పిటల్ భోజనం పరిశీలించారు. ఆసుపత్రి పరిశుభ్రత, మొక్కలకు నీరు పోసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, టెక్కలి

## ఐతమ్‌లో నూతన పుస్తకావిష్కరణ

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈసిఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పేడాడ కామేశ్వరరావు నూతనంగా రచించిన వీఎల్‌ఎస్ఐ డిజైన్ ప్రిన్సిపుల్స్ అండ్ అప్లికేషన్స్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక ఆవశ్యకతను వివరించారు. ఈసిఈ, ఈఈఈ విభాగాల్లో బిటెక్, ఎంటెక్ కోర్సుల్లో విధ్యాబ్యాసం చేస్తున్న వారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రచయిత డాక్టర్ పేడాడ కామేశ్వరరావును డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్డి డాక్టర్ వి.అశోక్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రజ్ఞానం అవసరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగాలకు సంబంధించిన క్షేత్రజ్ఞానం అవసరమని గురజాడ విద్యాసంస్థలడైరెక్టర్ సంయుక్త అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల జీవశాస్త్ర విభాగాలు ఏర్పాటుచేసిన సైన్స్ ఎక్సపోలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎక్స్‌పోను శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల జీవిశాస్త్ర విభాగాధిపతి ఎం.ప్రదీప్ ప్రారంభించి, విద్యార్థులు చేసిన వివిధ ప్రయోగాలను చూశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీవీ సత్యనారాయణ, ఐక్యూఏసి డాక్టర్ మార్తాండ కృష్ణ, సీతారాంనాయుడు, ధన్వంతరి, ఉమామహేశ్వరి, తనూజా, బాలసుందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.